సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం, 1, ఆగస్టు, 2025



వైభవంగా రామయ్య పట్టాభిషేకం

వాల్మీకిపురం పట్టణంలోని శ్రీ పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో గురువారం శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. -8లో



అంగళ్లులో 'హై' టెన్షన్.!

అంగళ్లులోని 220 సర్వే నెంబరు భూమిని సర్వేయర్లు కొలతలు నిర్వహించారు. హై టెన్షన్..కట్టుదిట్టమైన పోలీస్ భద్రత మధ్య సర్వే జరిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.470
రెండోరకం	రూ.200	రూ.360

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 290 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	570	572
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 134.480 కిలోలు

న్యూస్‌రీల్

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన టి.రమేష్ రెడ్డిని రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

విజయవాడలో హజ్ ఎంబార్కేషన్ కేంద్రం


మదనపల్లె సిటీ: హజ్‌యాత్రికుల సౌకర్యార్థం విజయవాడలో కొత్తగా హజ్ ఎంబార్కేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ తెలిపారు. ఈ నిర్ణయంతో యాత్రికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. యాత్రికులు విజయవాడ కేంద్రంగా ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గురుకులంలో నేరుగా ప్రవేశాలు



కడప రూరల్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని 24 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి ఖాళీలను భర్తీ చేయడంలో భాగంగా నేరుగా ప్రవేశాలు పొందవచ్చని జిల్లా సమన్వయకర్త ఉదయశ్రీ తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో చేరడానికి, విద్యార్థులు నేరుగా స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని అన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



లక్కిరెడ్డిపల్లి: మండలంలోని దివ్యాంగులు వినికిడి యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లాఅధ్యక్షుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి అవసరాలను బట్టి భారత ప్రభుత్వం కృత్రిమ అవయవాల తయారీ సంస్థ దివ్యాంగులకు పరీక్ష నిర్వహించి వినికిడి యంత్రాలను అందజేస్తుందని తెలిపారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ల వాహనాలు, నాలుగు చేతి కర్రలు, వీల్ చైర్లు, తోపుడుబండ్లు, బ్యాటరీ సైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్లు అందించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 6న లక్కిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఢిల్లీ బృందం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.వారంలోపు వినికిడి యంత్రాలు అందజేస్తారన్నారు.

అది అసత్య ప్రచారం

రాయచోటి టౌన్: రాయలసీమ ప్రాంతానికి చెందిన కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు గృహ హింస చట్టం-2005 అమలుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అసత్యపు ప్రచారమని జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, సాధికారత అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహహింస చట్టం-2005ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా జిల్లా స్థాయిలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి ఆధ్వర్యంలో మాత్రమే అమలు జరుగుతోందన్నారు. గృహ హింసలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు గృహహింస నుంచి రక్షణ పొందేందుకు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీలోని శిశుసంక్షేమ, సాధికారత కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

2న అన్నదాత సుఖీభవ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్, పేదరికం లేని సమాజం - పీ4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్, సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో నగదు బదిలీ కార్యక్రమం జరుగుతుందని అధికారులకు సూచించారు.

భగ్గుమన్న బొప్పాయి రైతు

ఇటు వ్యాపారులు, అటు దళారులు కలసి బొప్పాయి ధరలతో ఆటాడుకుంటున్నారు. దీంతో ధరలు ఊగిసలాడుతున్నాయి. మొదట కోతల సమయంలో టన్ను రూ.20 వేల నుంచి రూ.16 వేల వరకు ధరలు పలికాయి. దిగుబడులు తక్కువగా ఉన్నా ధరలు బాగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే క్రమేణా వ్యాపారులు ధర తగ్గిస్తూ వచ్చారు. తోటల్లో కాయలు మాగిపోతున్నాయని వ్యాపారులు చెప్పిన ధరకే వేస్తూ వచ్చారు. అయితే మళ్లీ ధరలు తగ్గించాలని చెప్పడంతో రైతులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు.



రోడ్డుపై మంటలు వేసి ఆందోళన చేస్తున్న రైతులు

- ధరలు తగ్గుదలపై మండిపాటు
- రోడ్లపై మంటలు వేసి ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు
- రైతు వెన్నువిరుస్తున్న దళారులు


రైల్వేకోడూరు అర్బన్: జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బొప్పాయిపంట దిగుబడి మొదలైంది.రెండు నెలల క్రితం టన్ను రూ. 20 వేలు ఉండేది. వ్యాపారులు కుమ్మక్కై రేటును తగ్గిస్తూ వచ్చారు.గురువారానికి రూ. 6 వేలు అవడంతో రైతులు భగ్గుమన్నారు. స్థానిక తిరుపతి రోడ్డు, టోల్‌గేట్, చిట్వేలిరోడ్డు, బైపాస్, రాఘవరాజపురం వ్యాపారుల కార్యాలయాల వద్ద కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలిలకు చెందిన 500 మంది గురువారం ఉదయం ఆందోళన చేశారు. బొప్పాయి లోడింగ్‌కు పోతున్న లారీలను ఆపేసి అందులోని గడ్డి తీసి రోడ్డుపై కుప్పలు వేసి నిరసన వ్యక్తం చేశారు. పలు చోట్ల పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. వ్యాపారులను, దళారీలను నిలదీశారు. నిరసనలతో 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా బొప్పాయి పంటను పండిస్తుంటారు. ఖర్చులు, భూమి కౌలు కలిపి ఎకరాకు లక్ష రూపాయల వరకు ఖర్చు వస్తుంది. తెగుళ్లను జయించి పంట దిగుబడి చేస్తే కోతకు ముందు ధరలు పెంచి ఆశలు పెడతారు. తీరా ఎగుమతుల సమయంలో ప్రతి ఏడాది ధరలు భారీగా తగ్గించి నట్టేట ముంచుతున్నారని వాపోయారు. ఇప్పుడున్న టన్ను 7 వేల రూపాయల ధర సరిపోదని, ఆత్మహత్యలు చేసుకోవాల్సిందేనని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీఐ

పోలీసుల హెచ్చరిక

ఆందోళన చేస్తున్న రైతులను సీఐ హేమసుందర్‌రావు, పోలీసులు అడ్డుకున్నారు. తాహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని, చర్చలు జరుపుతామని తెలిపారు. దీంతో రైతులు సభాభవనం వద్దకు చేరుకొన్నారు. కొద్దిసేపటికి జిల్లా ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే అక్కడికి చేరుకొని రైతులను హెచ్చరించారు. ధర్నాలు రాస్తారోకోలు చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని తెలిపారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కారూపానందరెడ్డి , తాహసీల్దార్ అమర్‌నాథ్ ధరల గురించి తెలుసుకొని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దళారీలపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. బొప్పాయి రైతులకు న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాలి.



ధరలు పెరిగినా లాభం రాలేదు



గత సంవత్సరం రెండెకరాల్లో బొప్పాయి పండించా. అయితే గాలికి, తెగుళ్లకు పూర్తిగా దెబ్బతింది. పంట కొద్దిగా వచ్చినా ధర పెరిగిందనుకున్నా.అంతలోనే తగ్గించారు. రెండు సంవత్సరాలు నష్టాలు వస్తే ఒక్క సంవత్సరం కూడా లాభాలు రావడం లేదు. – ఎంసుబ్బరాయుడు, రైతు, సిద్దారెడ్డిపల్లి, చిట్వేలి మండలం.

దళారుల మోసాలతో నష్టాలు



బొప్పాయి పంట నాణ్యంగా పండించినా చివరకు దళారుల దెబ్బకు అప్పులే మిగులుతున్నా యి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి. అలాగే బొప్పాయి వ్యాపారాన్ని చట్ట బద్ధత చేసి ప్రభుత్వం ధరలను పర్యవేక్షించాలి. –భూమాశివశంకర్‌రెడ్డి, రైతు,బుడుగుంటపల్లి, రైల్వేకోడూరు

కల్లబొల్లి మాటలు మాని రైతులను ఆదుకోండి

- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు మాని వెంటనే బొప్పాయి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు.గురువారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో వ్యవసాయ రంగం అతలాకుతలమైందని తెలిపారు. రైతులు ప్రతి సారీ రోడ్డెక్కే పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కోసిన పంట అమ్ముడుపోక ఉన్న ధరకు అమ్ముకోలేక తోటలలోనే వదిలేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, కూటమి నాయకులు మాయమాటలతో కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏనాడు రైతులు కష్టాల పాలవ్వలేదన్నారు. అన్నదాతలను అన్నిరకాలుగా ఆదుకున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు సీహెచ్ రమేష్, నందబాల, మందారు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

దళారీలదే రాజ్యం



కోడూరు ప్రాంతంలో దళారీలదే రాజ్యంగా ఉంది. నిన్న ఉన్న ధరలు ఈరోజు ఉండడం లేదు 10 ఎకరాల బొప్పాయి పంటకు టన్ను రూ. 7వేలు ఇస్తే పెట్టుబడి కూడా రాదు. ఈప్రాంత రైతులు నష్టాలపాలయ్యారు.ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి. – సుబ్బరామరాజు, మాజీ మార్కెట్ చైర్మన్, బొప్పాయి రైతు, కేఆర్ కండ్రిక, రైల్వే కోడూరు

'ఇరగంరెడ్డి' నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న ఒంటిమిట్ట జెడ్పీటీసీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి



వైఎస్సార్ సీపీ తరుపున ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న హేమంత్‌రెడ్డి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట, పులివెందుల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాలకు గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరుపున ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, టక్కోలు శివారెడ్డి, చేశారు. జనసేన పార్టీ తరుపున కోనేటి హరి వెంకట రమణ, స్వతంత్ర్య అభ్యర్థిగా వై.మధుమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. జెడ్పీసీఈఓ ఓబులమ్మకు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయనని అన్నారు. తనకు మద్దతు ఇచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి,, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడె టక్కోలు శివారెడ్డి, రాజంపేట నియోజకవర్గం యూత్ వింగ్ అధ్యక్షుడు కుండ్ల ఓబుల్ రెడ్డి, పార్టీ నాయకులు మేకపాటి నందకిషోర్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ దున్నుతల లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

- ఒంటిమిట్టలో ఏలేశ్వరం మధుమూర్తి స్వతంత్ర అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కడప సిఈఓ కార్యాలయంలో ఓబులమ్మకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.
- పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరుపున తుమ్మల హేమంత్‌రెడ్డి రెండు, తుమ్మల ఉమాదేవి రెండు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఓబులమ్మకు సమర్పించారు. దీంతో రెండోరోజు నాటికి 13 నామినేషన్లు దాఖలయ్యాయి.


ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పెద్దరోడ్డు వీధిలో ఎగురుతున్న టీడీపీ జెండా

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి మండలంలో అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కనిపిస్తోంది. గురువారం మండల పరిధి కొండ మాచుపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటం, ఆయన ప్రవేశపెట్టిన ఇది మంచి ప్రభుత్వం అనే గోడ పత్రాలు కనిపిస్తున్నాయి. ఈ పంచాయతీలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి సంఘటనలు బయటపడడం ఇది రెండోసారి, అలాగే కొత్త మాధవరం గ్రామంలోని పెద్ద రోడ్డు వీధిలో టీడీపీ జెండా ఎగురుతూ కనిపించింది. సంబంధిత ఎన్నికల అధికారి కోడ్ అమలు చేయడంలో విఫలమయ్యారని ప్రజలు అంటున్నారు.

నేడు వైఎస్ఆర్ జిల్లాకు సీఎం చంద్రబాబు రాక



కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఆగస్టు 1న జమ్మలమడుగు మండలంలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన పర్యటనలో భాగంగా గూడెం చెరువు గ్రామంలో లబ్ధిదారు గృహానికి వెళ్లి పింఛన్ల పంపిణీ, ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో స్థానిక నేతలతో భేటీ , అనంతరం గండికోటలో పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు.

సీఎం షెడ్యూల్


ఉదయం 11.45 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టరులో బయల్దేరి మధ్యాహ్నం 12.15 గంటలకు జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోనీ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12.25కు గూడెంచెరువుకు చేరుకుంటారు. 12.45 వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. 12.50 గంటలకు గూడెంచెరువులోని ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. 2 గంటల వరకు ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. 2.35 నుంచి 3.35 వరకు నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాల్‌లో స్థానిక కేడర్ నేతలతో సమావేశం అవుతారు. అనంతరం 3.45కు హెలికాప్టరులో బయల్దేరి 3.55 గంటలకు గండికోట హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 4.05 గంటలకి గండికోటలో ఓబెరాయ్ హోటల్, జార్జ్ వ్యూ పాయింట్, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 4:35 గంటల నుండి 5:25 గంటల వరకు జెకె రిసార్ట్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన స్టేక్ హోల్డర్స్, ప్రాజెక్టు డెవలపర్లతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 5.50కి కడప విమానాశ్రయం చేరుకుంటారు. 6.00 గంటలకు కడప నుంచి బయలుదేరుతారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

జమ్మలమడుగు రూరల్: సీఎం నారా చంద్రబాబు నాయుడి జమ్మలమడుగు పర్యటనను కలసికట్టుగా విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు. శుక్ర వారం జమ్మలమడుగు మండలపరిధిలోని గూడెంచెరువు గ్రామంలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆమె ముఖ్యమంత్రి పర్యటన సలహాదారు పెందుర్తి వెంకటేష్ జిల్లా నేతలతో కలిసి పర్యవేక్షించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి, జమ్మలమడుగు ఇంఛార్జీ భూపేష్‌రెడ్డి , ఆర్డీఓలు జాన్ ఎర్విన్, చంద్రమోహన్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక వెతలు

- పొజిషన్ ఐడీలు కేటాయింపుల్లో నిర్లక్ష్యం
- జీతాలు రాక అవస్థలు పడుతున్న టీచర్లు
- విద్యాశాఖ నిర్లక్ష్యంపై మండిపాటు



మదనపల్లె సిటీ: బదిలీలు ఉపాధ్యాయులకు శాపంగా మారాయి. ఈ ప్రక్రియ ప్రారంభం నుంచి సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. తాజాగా స్థాన చలనం కలిగిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. విద్యాశాఖ పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడంతో జీతాలు రాక అవస్థలు పడుతున్నారు. బదిలీల సాకుతో వారికి జీతాలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు అగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విద్యాశాఖ నిర్లక్ష్యంపై మండిపడుతున్నాయి.

- కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఉపాధ్యాయ బదిలీ చట్టం ద్వారా ఇటీవల పలువురు టీచర్లకు పదోన్నతులు,బదిలీలు జరిగాయి. వీరిలో వేలాది మందికి పొజిషన్ ఐడీలు రాక జూన్ నెల నుంచి ఇప్పటి వరకు జీతం అందలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,737 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 18,540 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7 వేల మందిని బదిలీ చేశారు. అదే విధంగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు 800 వరకు ఉన్నారు. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 4217 మంది వివిధ క్యాడర్లలో బదిలీ అయ్యారు. వీరిలో 202 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, 1815 మంది స్కూల్ అసిస్టెంట్లు, 2047 మంది సెకండ్ గ్రేడ్ టీచర్లు, 114 మంది లాంగ్వేజ్ పండిట్లు, 11 మంది ఏఆర్‌టీ క్రాఫ్ట్,మ్యూజిక్ ఒకేషన్ టీచర్లు, 28 మంది పీడీలు ఉన్నారు. బదిలీలు సాధారణంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓలకు సమాచారం అందిస్తారు. గతంలో రెగ్యులర్ జీతాలు తీసుకుంటున్నా వీరి స్థానం మారడంతో బదిలీ అయిన స్థానానికి పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే సీఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలు కనిపిస్తాయి. అప్పుడు జీతాలు చెల్లించడానికి వీలుంటుందని ఉద్యోగ,ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పది రకాల పాఠశాలల్లో 5 రకాల పాఠశాలల ఉపాధ్యాయులు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అప్‌గ్రేడ్ అయిన ప్రాథమికోన్నత, కొత్తగా ఏర్పాటైన మోడల్ ప్రైమరీ పాఠశాలలు, కొత్తగా పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 హెచ్‌ఎంలకు జీతాలు రాలేదు. వీరందరికి పొజిషన్ ఐడీలు కేటాయించాల్సి ఉంది. ముఖ్యంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలకు పలువురు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను కేటాయించారు. వాస్తవానికి ఆ పాఠశాలల్లో గతంలో కేడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా ఉన్న పోస్టులకు జీతాలు చేసే వీలుంటుంది. కొత్తగా వచ్చిన పోస్టులకు పొజిషల్ ఐడీలు కేటాయించిన తరువాతే జీతాలకు అవకాశం ఉంటుంది. అప్‌గ్రేడ్ అయిన యూపీ స్కూళ్ల టీచర్లకుఇదే ప్రధాన సమస్యగా మారింది.

పొజిషన్ ఐడీలు మంజూరు చేయాలి



పొజిషనల్ ఐడీలు మంజూరు చేయాలి. టీచర్ల పట్ల ఇంత చులకన భావన ఎందుకో..రెండు నెలల జీతాలు రాకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.. కేడర్‌స్ట్రెంత్ నివేదికలు సిద్ధం చేసి పొజిషన్ ఐడీలు ఇవ్వడం పట్ల అలసత్వం వహించడం దారుణం. –ఆర్.వి.రమణ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

అన్యాయం



పొజిషన్ ఐడీలు ఇవ్వకుండాఆ ఆలస్యం చేయడం అన్యాయం. నెలల తరబడి ఐడీల పేరుతో జీతాలు ఇవ్వకపోవడం సరికాదు.ఈ సమస్య రాష్ట్రం మొత్తం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా అలసత్వం వహించడం సరికాదు. -రెడ్డప్పరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఆగస్టు 31లోపు నాటుసారా రహితంగా జిల్లా



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏఈఎస్ జోగీంద్ర, సీఐ భీమలింగ

మదనపల్లె రూరల్: జిల్లాను ఆగస్టు 31లోపు నాటుసారా రహితంగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ ఎక్సైజ్ సూపరిండెంట్ వై.జోగేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ భీమలింగతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 71 సారా తయారీ గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటివరకు 55 గ్రామాలను సారారహితంగా తీర్చిదిద్దామన్నారు. వినవోదయం 2.0 కార్యక్రమం కింద జిల్లాలో 325 మందికి ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలను చూపి జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కలెక్టర్ నిర్ణయం తర్వాత వారందరికీ ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ప్రతి మద్యం షాపు వద్ద ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తిస్తే ప్రజలు సెల్‌ఫోన్‌లో స్కాన్ చేసి, ఫిర్యాదుచేయవచ్చన్నారు. మద్యంషాపుల్లో ఎంఆర్‌పీ ధరలకు మించి ఎక్కువగా అమ్ముతున్నా, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నా... ఎక్సైజ్‌శాఖ టోల్ ఫ్రీనెంబర్ 14405కు ఫోన్ చేసి ఫిర్యాదుచేయాలన్నారు.

అంగళ్లులో హై టెన్షన్..!

- ఈ భూమి మాదే..కాదు మాది
- పదేళ్లుగా కొనసాగుతున్న 220 భూ వివాదం
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య సమగ్ర భూ సర్వే


అంగళ్లు 220 భూ సర్వేపై సూచనలిస్తున్న రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, తహసీల్దారు ధనుంజయులు


సర్వే వివరాలు నమోదు చేస్తున్న సర్వేయర్లు, వీఆర్ఓలు

కురబలకోట : అన్నమయ్య జిల్లాలోనే అత్యంత వివాదాస్పద భూమిగా పేరు గాంచిన అంగళ్లులోని 220 సర్వే నెంబరు భూమిని గురువారం సర్వేయర్లు కొలతలు నిర్వహించారు. హై టెన్షన్.. ఆపై కట్టుదిట్టమైన భారీ పోలీస్ భద్రత మధ్య మూడు బృందాలతో ఈ సర్వే నిర్వహించారు. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ పహారాలో తహసీల్దార్ ధనుంజయులు పర్యవేక్షణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండల సర్వేయర్ భువనేశ్వరి నేతృత్వంలో పకడ్బందీగా సర్వే నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు వర్గాలు, భూ బాధితుల కథనం మేరకు..అంగళ్లులోని మిట్స్ యూనివర్సిటీ (కదిరి రోడ్డు) మార్గంలో హైవే పక్కన 220 సర్వే నెంబరు ఉంది. ఇందులో నాలుగు లెటర్లలో 69.42 ఎకరాల భూమి ఉంది. ఇందులో 220/4లోని ఐదున్నర ఎకరం అత్యంత వివాదాస్పద భూమిగా మారింది. దీనిపై రాయలసీమ జిల్లాల్లోని పులివెందుల, అనంతపురం, తిరుపతి, హిందూపురం తదితర ప్రాంతాల భూ కబ్జాదారుల కన్నుపడింది. మదనపల్లెకు చెందిన రియల్టర్ స్టోర్ రాజు, అంగళ్లు సుబహాన్ స్వాధీనంలో ఈ భూమి ఉంది. 2017 నుండి ఇక్కడ ప్లాట్లు వేసి 72 మందికి విక్రయించారు. అయితే ఈ భూమి తమదేనని మరికొందరు గత పదేళ్లగా ఈ భూమిపైకి రావడం దౌర్జన్యంగా ఆక్రమించడం జరుగుతూ వస్తోంది. ఫెన్సింగ్ వేయడం ఆ తర్వాత దీనిని అదే స్థాయిలో స్వాధీనంలో ఉన్న భూ ఆసాములు తొలగించడం జరుగుతూ వస్తోంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటుండడంతో పోలీసులకు, రెవెన్యూ అధికారులతో పాటు స్థానికులకు కూడా తలనొప్పిగా పరిణమించింది. రాష్ట్రంలో అధికారం మారినప్పుడల్లా అధికార పార్టీ అండతో ఈ భూమిపై పెత్తనం సాగించడం పరిపాటిగా వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఈ భూమిలో తమకు మూడు ఎకరాల 15 సెంట్లు భూమి ఉందని దీన్ని సర్వే చేసి హద్దులు చూపాలని తిరుపతికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు ఇటీవల స్థానిక తహసీల్దారుకు అర్జీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి ఆ సర్వే నెంబరులోని 35 మంది రైతులకు గురువారం సర్వే నిర్వహిస్తున్నట్లు ముందుగా నోటీసులు కూడా పంపారు. దీంతో ఒక్కసారిగా అంగళ్లు పరిసర ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది. గురువారం రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, పోలీసులు 50 మంది దాకా బందోబస్తు నిర్వహించారు. మండలంలోని సర్వేయర్లు వీఆర్ఓల సహకారం వీఆర్ఏల సాయంతో మూడు బృందాలుగా మొత్తం సర్వే నెంబరులోని భూమిని భౌగోళిక సర్వే నిర్వహించారు. తొలుత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా పోలీసులు అప్పటికప్పుడే వాటిని సద్దుమణిగించారు. మొత్తానికి హైటెన్షన్ మధ్య సర్వే ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం తర్వాత ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా భారీ పోలీసు బందోబస్తుతో అంగళ్లుతో పాటు పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు పెంచింది. సర్వే సందర్భంగా పెద్ద సంఖ్యలో జనం హైవేపై గుమికూడారు. సర్వే నివేదిక సిద్ధమైన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయని తహసీల్దారు ధనుంజయులు తెలిపారు.

ఇప్పట్లో తేలేలా లేదు..

ఈ భూమిపై హైకోర్టులో ఓ కేసు నడుస్తుండగా మదనపల్లె సివిల్ కోర్టులో మరో ఏడు కేసులు కొనసాగుతున్నాయి. దీన్ని బట్టి ఇప్పట్లో 220 భూ వివాదం కొలిక్కి వచ్చేలా లేదు. ప్రస్తుతం సర్వే నిర్వహించినా ఏ మాత్రం ప్రభావం చూపుతుందో చెప్పలేని పరిస్థితి. దీంతో ఈ భూ వివాదానికి కామా తప్ప ఫుల్ స్టాప్ పడే అవకాశాలు ప్రశ్నార్థకమేనని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అంగళ్లు పరిసర ప్రాంతాల్లో భూములు రేట్లు భగ్గుమంటున్నాయి. దీంతో పలువురు పాత భూ రికార్డులు, లింకు డాక్యుమెంట్లు తిరగేస్తున్నారు. డబ్బు ఆశే భూ వివాదాలకు ప్రధాన కారణంగా మారుతోంది.

220 వివాదాల మయం

అంగళ్లులోని 220 భూ వివాదం ఎప్పుడూ రగులుతూనే ఉంది. జిల్లాలోనే సంచలనంగా మారింది. ఒక్కోసారి శాంతి భద్రతల సమస్య కూడా ఉత్పన్నమవుతోంది. నిరసనలు, నిలదీతలు, ప్రతి ఘటనలు, దాడులు చోటుచేసుకుంటున్నాయి. రౌడీ గ్యాంగులు, భూ కబ్జాదారులు చెలరేగుతున్నారు. దీంతో ఈ సర్వే నెంబరులోని భూమి మొత్తాన్ని కొలవడానికి తహసీల్దారు పర్యవేక్షణలో సంకల్పించారు. ముందస్తు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. – సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్ కుమార్

వందేళ్ల పక్కా డాక్యుమెంటు ఉంది



అంగళ్లులోని సర్వే నెంబరు 220/4లో మా స్వాధీనంలో ఉన్న ఐదున్నర ఎకరం భూమికి వందేళ్ల పక్కా రికార్డు వుంది. సంబంధం లేని వాళ్లు కూడా ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి హక్కు ఉందని వస్తుండడం విచారకరం. మా డాక్యుమెంట్లు ఎవరైనా పరిశీలించుకోవచ్చు. మాకు రికార్డు ప్రకారం భూమి లేదు అని నిరూపిస్తే భూమి వదిలేయడానికి సిద్ధంగా ఉన్నాం. గతంలో కూడా ఇదే విషయం చెప్పాం. – స్టోర్ రాజు, రియల్టర్, మదనపల్లి

భూమిలో మాకూ హక్కు ఉంది

220 భూమిలో వంశ పారంపర్యంగా మాకు హక్కు సంక్రమించింది. కొందరు ఉన్న భూమి కంటే ఎక్కువగా అమ్మేశారు. మరికొందరు ఉన్న భూమిని హంద్రీ నీవా కాలువకు పోయి పరిహారం తీసుకున్నా మళ్లీ ఇదే సర్వే నెంబరులో రికార్డులు సృష్టించి భూమి ఆక్రమణలో ఉంచుకున్నారు. దీంతో సర్వే నెంబరు మొత్తాన్ని సర్వే నిర్వహించి మా భూ భాగం తేల్చి హద్దులు చూపాలని కోరాం. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా. – చల్లా వెంకటేశ్వర్లు, తిరుపతి

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ నిజాయితీ


సెల్‌ఫోన్‌ను ఏఎస్ఐకు అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ నూరుల్లా

కేవీపల్లి : తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. మండలంలోని గుండ్రేవారిపల్లె క్రాస్‌కు చెందిన నూరుల్లా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా గురువారం ప్యాసింజర్స్‌తో కేవీపల్లె నుంచి గుండ్రేవారిపల్లె క్రాస్‌కు బయలుదేరాడు. అయితే మార్గం మధ్యలోని గరిమిట్ట సమీపంలో రోడ్డుపై సెల్‌ఫోన్ పడి ఉండటాన్ని గుర్తించాడు. సుమారు రూ. 30 వేలు విలువైన ఫోన్‌ను నిజాయితీతో సీపీఐ నాయకులు శ్రీనివాసులతో కలసి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ వెంకటస్వామికి అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ మండలంలోని దేవాండ్లపల్లెకు చెందిన వెంకటేష్‌దిగా గుర్తించి ఆయనకు అప్పగించారు. నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ నూరుల్లాను అభినందించారు.

భార్యపై కత్తితో దాడి


తీవ్రంగా గాయపడిన సుజాతా బాయి

మదనపల్లె రూరల్ : భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండలో నివాసమున్న కుళ్లాయి నాయక్(40) తన భార్య సుజాత బాయి (36)పై అనుమానంతో మద్యం తాగి రోజూ గొడవపడేవాడు. అదే విధంగా భర్త మద్యం సేవించడంపై భార్య సుజాతబాయి సైతం గొడవకు దిగేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుళ్లాయి నాయక్ భార్యపై అనుమానం వ్యక్తం చేసి గొడవకు దిగడంతో వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఆవేశానికి లోనైన భర్త తన భార్యపై కత్తితో దాడి చేసి శరీరంపై రెండు చోట్ల పొడిచాడు. గమనించిన స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే సుజాతబాయి బంధువులు, కుటుంబ సభ్యులు కుళ్లాయి నాయక్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో అతను గురువారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఘటనపై తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆటో–ట్రాక్టర్ ఢీ

– ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి గురైన ట్రాక్టర్ - ఆటో

పీలేరురూరల్ : ఆటో – ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని మొరవవడ్డిపల్లె వద్ద జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వేపులబైలుకు చెందిన ఎ. సురేష్ (45) తన ఆటోలో క్యాటరింగ్ చేసేందుకు తలపులకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పీలేరుకు వస్తూ మార్గమధ్యంలో జాండ్లకు చెందిన షేక్ షకీలా (35), రొంపిచెర్ల మండలం చిచ్చిలివారపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన ప్రభావతి (40) పీలేరుకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. అయితే మొరవవడ్డిపల్లె వద్ద పీలేరు నుంచి తలపులకు వెళుతున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద ఆటో పడి నుజ్జునుజ్జయింది. ఆటోలో ఉన్న సురేష్, షకీలా, ప్రభావతికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం తీవ్ర స్థాయిలో జరిగినా ఆటోలో ముగ్గురు ప్రాణాలతో బయటపడడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొప్పాయికి మద్దతు ధర ప్రకటించాలి

రాయచోటి : అన్నమయ్య జిల్లాలోని బొప్పాయి రైతులకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఏపీ రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతిలో బొప్పాయి రైతుల సమస్యలపై ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డిలు వ్యవసాయశాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు ప్రాంతాలలో బొప్పాయి పంటను రైతులు విస్తారంగా పండిస్తారన్నారు. బొప్పాయి పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్‌లో ఉన్న బొప్పాయి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు ధరలు తగ్గించి బొప్పాయి రైతులను ప్రతి ఏటా మోసం చేస్తున్నారన్నారు. ఈ ఏడాది కూడా బొప్పాయి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రోజురోజుకు ధరలు తగ్గిస్తున్నారని వివరించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని బొప్పాయి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కనీసం కిలో రూ. 25లుగా ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

ఆర్థిక సౌలభ్యాలను రద్దు చేయడం తగదు


ఏపీ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాయచోటి డివిజన్ నూతన కార్యవర్గం

రాయచోటి జగదాంబసెంటర్ : రిటైర్డ్ ఉద్యోగులు సాధించుకున్న ఆర్థిక సౌలభ్యాలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సులభంగా తక్కువ కాల వ్యవధిలో రద్దు ఉత్తర్వులు ఇస్తున్నారని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ గురురాజరావు పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని డైట్ సభా భవనంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాయచోటి డివిజన్ యూనిట్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన గురురాజరావు మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉద్యోగులు భాగస్వాములై ఎన్నో సంవత్సరాలు కష్టపడి పనిచేశారన్నారు. అలాంటి పెన్షనర్లను ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.రెడ్డన్న, గౌరవాధ్యక్షుడిగా సీఆర్‌వీ సుబ్రమణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా మల్లికార్జున, రామతులసమ్మ, శ్రీనివాసులు, శివనారాయణరెడ్డి, రామతుల శమ్మ, ప్రసాద్, జనరల్ సెక్రటరీగా రఘునాథరెడ్డి, కార్యదర్శులుగా శంకరయ్య, రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టీఎంఆర్ చంద్ర, కోశాధికారి ఎస్.లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్, సంఘం నాయకులు సురేంద్రారెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేకే అక్రమ అరెస్టు


ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టెంకాయలు కొడుతున్న నిసార్ అహ్మద్

మదనపల్లె రూరల్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ కలిసి ఎంపీ మిథున్‌రెడ్డిని లేని లిక్కర్ స్కామ్‌లో అక్రమంగా అరెస్ట్ చేయించారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని, అక్రమంగా అరెస్ట్ అయి జైలులో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి, బైపాస్‌రోడ్డు సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు తారాస్థాయికి చేరాయనేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ ఓ ఉదాహరణ అన్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ప్రజాదరణను చూసి చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదంలో ఫైల్స్ దగ్ధమైతే పెద్దిరెడ్డి చేయించారని తప్పుడు కేసులు పెట్టారన్నారు. అటవీ భూములు కబ్జాచేశారని, బుగ్గమఠం భూములు ఆక్రమించారని, అక్రమ మైనింగ్ చేశారని కేసుల మీద కేసులు బనాయించారన్నారు. ప్రతి కేసులోనూ న్యాయపోరాటం చేస్తూ తాము ఏ తప్పు చేయలేదని పెద్దిరెడ్డి కుటుంబం నిజాయితీని నిరూపించుకుంటూనే ఉందన్నారు. అయినా పెద్దిరెడ్డి కుటుంబంపై వ్యక్తిగతంగా చంద్రబాబుకు ఉన్న ప్రతీకారాన్ని తీర్చుకునేందుకు లేని లిక్కర్ స్కాంను తెరపైకి తీసుకువచ్చి మిథున్‌రెడ్డిని ఇరికించి అక్రమంగా అరెస్ట్ చేయించారన్నారు. అయితే, ఆయన కడిగిన ముత్యంలా కేసుల నుంచి బయటకు వస్తాడన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.మహేష, ఆవుల మల్లికార్జున, శారదారెడ్డి, అపర్ణ, వినుతా భాయి, మల్లికార్జునరెడ్డి, మధు, నర్సింహులు, యూనస్, ఖిజర్‌ఖాన్, జబీవుల్లా, యాసిన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రామయ్య పట్టాభిషేకం


పట్టాభిరామాలయంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు


గరుడవాహనంపై తిరుమాఢ వీధులలో ఊరేగుతున్న శ్రీసీతారామలక్ష్మణులు

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణంలోని శ్రీ పట్టాభిరామాయలంలో టీటీడీ ఆధ్వర్యంలో గురువారం శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చన, అభిషేకం, తోమాల సేవ అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు స్వామి వారి పట్టాభిషేక మహోత్సవ ఘట్టాన్ని భక్తుల నడుమ ఘనంగా చేపట్టారు. సాయంత్రం ఆలయంలో ఊంజలసేవ మండపంలో ఊంజల సేవ జరిగింది. రాత్రి శ్రీ సీతారామలక్ష్మణులు గరుడ వాహనంపై తిరుమాఢ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు క్రిష్ణబట్టార్, భాషికాచార్యులు తదితరులు పాల్గొన్నారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి హాజరైన శ్రీసీతారాములను దర్శించుకున్నారు. చింతల ఆనందరెడ్డి, బిడ్డల కేశవరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి


మణికంఠ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి వేగంగా వచ్చి ఆటో ఢీకొనడంతో మణికంఠ(19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కడప వన్ టౌన్ ఎస్ఐ అమరనాథ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు కమలాపురం మండలానికి చెందిన మణికంఠ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యువకుని తల్లిదండ్రులు శైలజ, గంగాధర్‌లు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఊరి నుంచి సొంత పని నిమిత్తం కడపకు చేరుకున్నాడు. కడప రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

డ్రాగా ముగిసిన అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు


చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. మూడో రోజు గురువారం వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. 242 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతపురం జట్టు 84.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 325 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని ఆదినారాయణరెడ్డి బ్యాటింగ్‌లో చక్కగా రాణించి 156 పరుగులు చేశాడు. దేవాన్ష్ 47 పరుగులు చేశాడు. కడప జట్టులోని హితేష్ సాయి 3 వికెట్లు, గైబు 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 67.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది.

ఆ జట్టులోని లోకేష్ 85 పరుగులు, ఫైజాన్ 45 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని కిరణ్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ అనంతపురం జట్టు ఆధిక్యం సాధించింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. గురువారం మూడో రోజు 300 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 111.5 ఓవర్లలో 322 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని వివేక్ 35 పరుగులు చేశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 71.1 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని విజె నోయెల్ 60 పరుగులు, హర్ష 36 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని వివేక్ 3 వికెట్లు, సాయి విఘ్నేష్ 3 వికెట్లు తీశారు. తర్వాత రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 12 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించింది.

చందనకు అభినందన


చందన

ఒంటిమిట్ట : ఇస్రో ఎన్ఐఎస్ఏఆర్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి బుధవారం పంపిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌లో ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన అవ్వారు చందన తన వంతు పాత్ర పోషించారు. ఈమె రెండు నెలల క్రితం ఓ పెద్ద ప్రమాదంలో గాయపడి తిరిగి కోలుకుని తన ఉద్యోగ బాధ్యతలను కొనసాగించారు. ఈమె బెంగళూరులోని ఇస్రోలో సైంటిస్టుగా పనిచేస్తున్నారు. ప్రమాదం నుంచి కోలుకున్న కొన్ని రోజులకే ఆమె మరలా దేశం గర్వించే ప్రయోగంలో పాలుపంచుకోవడాన్ని చూసిన గ్రామస్తులు చందనను పడిలేచిన కెరటంలా అభివర్ణిస్తూ అభినందిస్తున్నారు.

ద్విచక్రవాహనాల చోరీ

కలకడ : ద్విచక్రవాహనాల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలకడ ప్రభుత్వ ఆసుపత్రి దారిలో నివాసం ఉన్న బాబుహుస్సేన్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్, మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన సయ్యద్ అహమ్మద్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనాలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ద్విచక్రవాహనదారులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో రైల్వే కార్మికుడి మృతి


మృతి చెందిన అర్జున్

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని బియ్యం గోడౌన్ వద్ద ఉన్న ఈద్గా సమీపంలో ఎ. అర్జున్ (56) అనే రైల్వే కార్మికుడు అనారోగ్య సమస్యతో మృతి చెందాడని గురువారం సీఐ బాబు తెలిపారు. చిత్తూరు జిల్లా నారాయణ వనం మండలానికి చెందిన అర్జున్ రైల్వే కార్మికుడిగా పనిచేసేవాడు. బుధవారం ఇంటర్‌సిటీ రైలులో వెళ్తుండగా అనారోగ్యానికి గురయ్యాడు. ఒంటిమిట్టలో దిగి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుని స్థానిక బియ్యం గోడౌన్ వద్ద ఉన్న ఈద్గా సమీపంలో సేదతీరాడు. కొద్దిసేపటికి మళ్లీ అనారోగ్య సమస్య తలెత్తడంతో ఊపిరాడక ఒంటిపై ఉన్న దుస్తులను తొలగించాడు. అయినా తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న సీఐ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అర్జున్ కుమారుడు మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకెళ్లాడు.

యోగా పోటీల్లో వైఎస్సార్ కడపకు ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్


ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేస్తున్న పల్నాడు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి

యడ్లపాడు : చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి యోగాక్రీడా ప్రదర్శన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను వైఎస్సార్ కడప క్లస్టర్‌లోని జేఎన్‌వీ సాధించుకుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలోని 8 క్లస్టర్ల నుంచి క్లస్టర్ లెవల్ వరకు జరిగిన యోగా పోటీల్లో గెలుపొందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కృష్ణా, వైఎస్సార్ కడప, బీదర్, షిమోగా, తుమ్మకూర్, పట్నంతిట్టా, వైనాడ్, ఖమ్మం ప్రాంతాలకు చెందిన 278 మంది క్రీడాకారులు పాల్గొని ఆసనాలు, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో యోగా విన్యాసాలు ప్రదర్శించి తమ కళాత్మక నైపుణ్యాలను చాటారు. ఆయా పోటీల్లో రాష్ట్రానికి చెందిన వైఎస్సార్ కడప క్లస్టర్ జేఎన్‌వీ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా, కృష్ణా క్లస్టర్ ద్వితీయస్థానంలో నిలిచింది. అన్ని విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన వైఎస్సార్ కడప క్లస్టర్ విద్యార్థులను, ద్వితీయస్థానంలో నిలిచిన కృష్ణా క్లస్టర్ విద్యార్థులను పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి షీల్డ్‌లు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని.. విద్యార్థినిపై చేయిచేసుకున్న టీచర్

ప్రొద్దుటూరు కల్చరల్ : యూనిఫాం వెనక్కి ఇవ్వలేదని విద్యార్థినిపై టీచర్ చేయిచేసుకున్న సంఘటన ప్రొద్దుటూరు నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగింది. దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముల్లా జుబేరియా ఐదో తరగతి చదువుతోంది. ఈ పాఠశాలలో యూనిఫాం ఇచ్చిన తర్వాత ఆ విద్యార్థిని నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసుకున్న యూనిఫాం తిరిగి ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబీహా మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో విద్యార్థిని చెంపపై కొట్టి వెళ్లిపోయింది. దీంతో విద్యార్థిని ఏడవడంతో అది విన్న తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు సంపూర్ణ వచ్చి పరిశీలించగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో ప్రధానోపాధ్యాయుడు శంకర్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. దీంతో ఆయన ఉపాధ్యాయురాలు సబీహాపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శోభారాణికి ఫిర్యాదు చేశారు. ఎంఈఓ స్పందిస్తూ శుక్రవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయురాలు షేక్ సబీహాకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు.